క్లుప్తంగా

పాఠశాలకు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు బహూకరణ



పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు బహూకరిస్తున్న దాతలు

చిలుకూరు : మండలంలోని రామాపురం జెడ్పీ పాఠశాలకు తెలంగాణ ఇంధన వనరుల అభివృద్ధి నల్లగొండ జిల్లా మేనేజర్ ఎస్.సూర్యనారాయణ బుధవారం 9సీలింగ్ ఫ్యాన్లు, 10ట్యూబ్ లైట్లు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గుజ్జుల నరసింహారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ ఎండీ అహ్మద్‌ఖాన్, ఎం.నాగేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రీతి ఆత్మహత్య కారకులను శిక్షించాలి

పాలకవీడు : మెడికో గిరిజన విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు గల కారకులను కఠినంగా శిక్షించాలని ఎల్‌హెచ్‌పీఎస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణావత్ సైదానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రీతి మృతికి కారణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

దీక్షకు బీఎస్పీ మద్దతు



మద్దతు తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరుపేదల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు బుధవారం బీఎస్పీ నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల కన్వీనర్ వాస కరుణాకర్ మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్, అధ్యక్షుడు ఉడిగే మల్లేష్‌యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొల్లగాని సుబ్బుగౌడ్, పెండెం రమణ, రామస్వామి, హుస్సేన్, మౌలాబి, అలివేలు, లక్ష్మమ్మ, నందిని, లక్ష్మి తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గరిడేపల్లి : తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన క్యాలెండర్‌ను బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు రాంబాబుగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూటికి 80శాతం ఉన్న ప్రైవేట్ ఉద్యోగులలో 70శాతం మందికి కనీస వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్‌ఐ ఇవ్వకపోవడంతో చాలీచాలని వేతనాలతో కాలం గుడుపుతున్నారని, ప్రభుత్వం ప్రైవేట్ ఉద్యోగులను ఆదుకునేందుకు ప్రత్యేక కమిటీలను వేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సుందరి శ్రీను, సైదులు, కె.శ్రీను, శేఖర్ తదితరులున్నారు.

చింతలపాలెం ఎంపీడీఓగా జోగు శ్రీనివాసరెడ్డి



హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం ఎంపీడీఓ (ఎఫ్‌ఏసీ)గా జోగు శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఉన్న ఎంపీడీఓగా ఉన్న పి.గ్యామా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో మేళ్లచెరువు సూపరింటెండెంట్‌గా ఉండి హుజూర్‌నగర్ స్పెషల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరెడ్డికి ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

కార్మిక సమస్యలపై పోరాడే వ్యక్తులను ఎన్నుకోవాలి

హుజూర్‌నగర్ : కార్మిక సమస్యలపై పోరాడే వ్యక్తులను నాయకులుగా ఎన్నుకోవాలని తెలంగాణ శిల్పకళ బిల్డింగ్ వర్కర్స్ (సీఐటీయూ) యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ముస్తఫా అన్నారు. బుధవారం పట్టణంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శుల పదవీకాలం ముగియడంతో నూతన కార్యవర్గం ఎన్నిక ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెంకన్న, అక్బర్, వేణు, నాగన్న, శ్రీను, నాగేష్, శాంతన్న పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్ పరిశీలన

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ కాలనీలో పగిలిన మిషన్ భగీరథ పైపులైన్ ప్రాంతాన్ని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ బుధవారం పరిశీలించారు. పైపు పగిలిపోవడంతో నీరు అంతా పంట పొలాలకు వెళ్లి రైతులు నష్టపోతున్నారని, వారికి తక్షణమే నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొల్లగాని సుబ్బుగౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, మహిళా అధ్యక్షురాలు రమణ, హుస్సేన్ తదితరులున్నారు.

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి పదిరోజుల పాటు రేపాల లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు



రేపాల శివారులో గుట్టపై నెలకొన్న లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం

దేవాలయ గర్భగుడిలో స్వామివారి విగ్రహం

మునగాల : తెలంగాణలో రెండో యాదగిరిగుట్టగా పేరుగాంచిన మండలంలోని రేపాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేటినుంచి (గురువారం) ప్రారంభమై పదిరోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు..

స్వయంభూ శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 11వ తేదీ వరకు 10రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ పానుగోటి రంగా తెలిపారు. పది రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్చి 2న స్వామివారు సిరిపురం నుంచి రాక, 03న అధ్యయనోత్సవం, 04న పరమపదోత్సవం, 05న రాత్రి 8గంటలకు ధ్వజారోహణం (గరుడముద్ద), 06న సాయంత్రం 5గంటలకు డోలోత్సవం, ఇదే రోజు రాత్రి 10గంటలకు స్వామి వారి కల్యాణమహోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే విధంగా 07న ఉదయం 10గంటలకు లక్ష్మీతులసి పూజ రాత్రి ఏడు గంటలకు గరుడోత్సవం, 08న రాత్రి ఏడుగంటలకు రథోత్సవం, 09న చక్రతీర్థం, రాత్రికి పూర్ణాహుతి, ధ్వజారోహణం, దోపు, 10న రాత్రి 10గంటలకు గాంధోళి (వసంతోత్సవం), 11న రాత్రి 9గంటలకు స్వామి పవళింపు సేవ, రాత్రి 12గంటలకు 12సేవల అనంతరం స్వామి వారు సిరిపురం వేంచేయుట ఉంటుందని తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలలో ఆలయ ప్రధాన అర్చకులు చివలూరి రామకృష్ణాచార్యులు, అర్చక స్వాములు చివలూరి విఖసనచార్యులు, చివలూరి సాయి కృష్ణమాచార్యులు కల్యాణోత్సవ వ్యాఖ్యాతగా చివలూరి లక్ష్మీనరసింహాచార్యులు నిర్వహిస్తారని దేవాలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

ఆలయ చరిత్ర..

మండలంలోని రేపాల గ్రామం పురాతన చారిత్రాత్మక గ్రామాల్లో పేరెన్నిక గ్రామం. మొదట రేపాల గ్రామం మునగాల పరగణ జమీందార్లు అయిన కీసర వారికి రాజధాని. కీసర వారి కులదైవం శ్రీలక్ష్మీనర్సింహస్వామి. పూర్వం రేపాల రాజధానికి దగ్గరలో గల సిరికొండ గ్రామంలో గుట్టమీద నెలకొని ఉన్న శ్రీలక్ష్మీనర్సింహస్వామిని కీసర వంశస్థులు ఆరాధించేవారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో..

రేపాలలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనర్సింహుడి ఆలయం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. నర్సింహుడి ఆలయానికి దాదాపు 70ఎకరాల భూమి ఉన్నప్పటికీ కౌలుదారులు కౌలు ఇవ్వకపోవడంతో ఆదాయం లేక ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. అటు భూమి కౌలు రాక, ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో ప్రతిఏటా దాతలు అందించే విరాళాలతోనే ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశాం



రేపాల గుట్టపై వెలిసిన స్వయంభూ శ్రీరాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి కల్యాణంతో పాటు పదిరోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు పరిసర ప్రాంత ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

– పానుగోటి రంగా, ఆలయ కమిటీ చైర్మన్, రేపాల

తెలంగాణలో వైఎస్సార్‌టీపీకి పెరుగుతున్న ఆదరణ

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు జల్లేపల్లి వెంకటేశ్వర్లు



హుజూర్‌నగర్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్ : తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు వైఎస్సార్ తెలంగాణ పార్టీకి ఆదరణ పెరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) అన్నారు. వైఎస్సార్‌టీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మర్రి యశోద, మండల పార్టీ అధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి రవి ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన దాదాపు 200 మంది బుధవారం పట్టణంలో వైఎస్సార్‌టీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జేవీఆర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలను మరిచిన సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాలనతో విసుగు చెందిన పలువురు వైఎస్సార్ టీపీలో చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలువ రమేష్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రామిశెట్టి మురళీప్రసాద్, పట్టణ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మీడియా ఇన్‌చార్జ్ ఎస్‌కే ఖలీల్‌బాబా, మండల నాయకులు అజయ్‌కుమార్‌యాదవ్, తుర్క శ్రీను, కుక్కడపు ఉపేందర్‌గౌడ్, రామ్‌నాయక్, కోటయ్య, రాజు, రాములు, వినోదు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) డిమాండ్ చేశారు. పాలకుర్తిలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం పట్టణంలో నిరసన తెలిపారు.

కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 50ఏళ్లు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి నెలకు రూ.5వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారని అన్నారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అందించాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కె పెద్ద మస్తాన్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బెజ్జం రమేష్, ఉపాధ్యక్షులు యడవల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి నేమిలి వీరయ్య, కోశాధికారి బండ్ల ఆనందరావు, పిట్టా పిచ్చయ్య, సతీష్, ఇంజమూరి వెంకటేష్ తదితరులున్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



హుజూర్‌నగర్‌రూరల్ : కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు



చిలుకూరు : చెన్నారిగూడెంలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రశాంతి

హుజూర్‌నగర్‌రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి కోరారు. బుధవారం మండల పరిధిలోని గోపాలపురంలో కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ శాసనాల నాగసైదయ్యతో కలిసి వారు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వార్డుల వారీగా ఉచిత కంటి పరీక్షలు చేయడంతో పాటు అద్దాలను, అందిస్తున్నారని, శస్త్ర చికిత్స అవసరమైన వారికి వెంటనే ఉచితంగా శస్త్ర చికిత్సలు సైతం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఎంపీటీసీ చీకూరి రాజారావు, మండల యూత్ అధ్యక్షులు వీరమల్ల సుందరయ్య, కార్యదర్శి బాల్దూరి ఇందిర, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వైద్యసిబ్బంది, గ్రామస్తులు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య అన్నారు. బుధవారం మండలంలోని చెన్నారిగూడెంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కమతం కొండల్, ఉపసర్పంచ్ జింకల నాగలక్ష్మినాగరాజు, కార్యదర్శి శ్రీను, మాజీ సర్పంచ్ నర్సయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ కస్తాల శ్రావణ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని 11వ వార్డులో కంటి వెలుగును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సరితావీరారెడ్డి, రాజా, విజయ, వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, డాక్టర్ సుష్మ, క్యాంపు సూపర్‌వైజర్ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడరూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ పక్కన కలెక్టర్, అదనపు కలెక్టర్



హాజరైన అధికారులు

కోదాడరూరల్ : నియోజకవర్గ సమస్యల పరిష్కారానికై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరితగతిని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి బీటీ రోడ్లు నిర్మించేందుకు రూ.25కోట్ల నిధులు, అదే విధంగా పలు గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలకు నిధులు మంజూరయ్యాయని, ఆ పనులను అధికారులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలని, విద్యుత్ సమస్య లేకుండా చూడాలని, రైతులకు ఇస్తున్న విద్యుత్‌ను అంతరాయం లేకుండా సరఫరా చేయాలన్నారు.

రైతులకు నీటి సమస్య లేకుండా చూడాలి.. కలెక్టర్

గ్రామాల్లో చివరి ఆయకట్టు వరకు నీరు అందే విధంగా ఇరిగేషన్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు. సాగర్, ఎస్‌ఆర్‌ఎస్పీ పరిధిలో కాల్వల ద్వారా సాగవుతున్న ఎకరం కూడా నీరు లేక ఎండిపోవద్దన్నారు. రైతులతో మాట్లాడి సమస్యను తెలుసుకొని సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్, ఆర్డీఓ లక్కినేని కిశోర్‌కుమార్, ఎంపీపీలు చింత కవితారాధారెడ్డి, చుండూరు వెంకటేశ్వరావు, జ్యోతిమధుబాబు, బిందునరేందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

నడిగూడెం : దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామంలో గల శ్రీవేంకటేశ్వరస్వామి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన పాలకవర్గం అధ్యక్షులుగా బొంతు పుష్పావతిమోహన్‌రావు, సభ్యులుగా ప్రతాపనేని లావణ్య, గంధం రాంబాబు, నారగాని సైదులు, కొర్ర మాలు, ఎల్.గోపయ్య ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కొప్పుల వీరమ్మ, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ రమేష్, కార్యనిర్వాహణాధికారి తుమ్మల వెంకటచలపతి, ఆలయ అర్చకులు కందాల శ్రీనివాసచార్యులు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గోదాడి వెంకన్న, ఇంద్రారెడ్డి, రమేష్‌బాబు, మోహన్‌రెడ్డి, వంశీ, పాషా, దస్తగిరి, యూసఫ్, నాగరాజు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమాలు



చిలుకూరు : పాదయాత్ర చేస్తున్న నాయకులు

చిలుకూరు : ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు ఉద్యమాలు చేస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్, మండల ఇన్‌చార్జ్ సూరిబాబు అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరుతూ మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు చేపట్టిన మాదిగ సంగ్రామ పాదయాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరుకుంది. అనంతరం హరిజనవాడలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకట్రావ్, సిద్దెల శ్రీను, సిద్దెల పిచ్చయ్య, రామకృష్ణ, అంజిబాబు, సైదులు, మనోహర్, మహేష్ పాల్గొన్నారు.

పాదయాత్రతో అందరినీ సంఘటితం చేస్తాం

హుజూర్‌నగర్ : పాదయాత్రతో విద్యార్థులను, యువతను, మహిళలను అందరినీ సంఘటితం చేస్తామని సంగ్రామ పాదయాత్ర రథసారథులు బొజ్జ సైదులుమాదిగ, ఏపూరి రాజు మాదిగ అన్నారు. మహాజన నేత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్చి 15న హైదరాబాద్‌ను దిగ్బంధిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంజేఎఫ్ నాయకులు సీహెచ్ బాలచంద్రుడు, బి.ప్రసాద్, వి.విశాఖ, రాము, రవీంద్ర, కోటేష్, శ్రీను, పి.వెంకట్రావు, వి.రామకృష్ణ, ఎం.సూరి పాల్గొన్నారు.

వర్గీకరణ ఉద్యమ అమరవీరులకు నివాళి

కోదాడఅర్బన్ : ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు జరిగిన ఉద్యమంలో అమరులైన వీరులకు వర్గీకరణ సాధించి వారికి అంకితం చేస్తామని ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు యలమర్తి రాము, కొండపల్లి ఆంజనేయులు అన్నారు. బుధవారం పట్టణంలోని రాజీవ్‌చౌక్‌లో వర్గీకరణ ఉద్యమంలో అమరులైన వారి చిత్రపటాలకు ఎంఎస్పీ నాయకులు నివాళులర్పించి అనంతరం మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ ఏపూరి సత్యరాజు మాదిగ, నాయకులు గోపి, ప్రసాద్, సుధాకర్, శ్రవణ్, పాపయ్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు విస్తృత పరచాలి



మాట్లాడుతున్న రాయపూడి భవాని

నేరేడుచర్ల : వాసవీ, వనితా క్లబ్‌ల సేవలను మరింత విస్తృత పరచాలని వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ రాయపూడి భవానీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన వాసవీ, వనితా క్లబ్‌ల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథి పాల్గొని మాట్లాడారు. నేరేడుచర్ల వాసవీ క్లబ్ సేవే పరమావధిగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిరుపేదలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. క్లబ్ నూతనంగా ఏర్పడిన అనతి కాలంలోనే ఇతర క్లబ్‌ల కంటే ముందులో స్థానంలో ఉందన్నారు. రీజినల్ సెక్రటరీ తిరునగరు పద్మావతి, జోన్ చైర్మన్ భువనగిరి లావణ్యలతో కలిసి పాక్షికంగా అంగవైకల్యంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద మహిళలకు, వాకింగ్ స్టాండ్‌ను పంపిణీ చేశారు. ముందుగా క్లబ్‌లకు సంబంధించిన సేవా కార్యక్రమాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవానీ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్‌ల అధ్యక్షులు కొత్త లక్ష్మణ్, వీరవెల్లి శ్రీలత, ప్రధాన కార్యదర్శులు గజ్జల కోటేశ్వర్‌రావు, పొలిశెట్టి సంధ్య, కోశాధికారులు భాగ్యలక్ష్మి, పొలిశెట్టి అశోక్, డిస్ట్రిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాచకొండ శ్రీనివాస్‌రావు, జోన్ మాజీ చైర్మన్ కందిబండ శ్రీనివాస్‌రావు, క్లబ్ సభ్యులు నటరాజ్, మాశెట్టి మోహన్, కోటేశ్వర్‌రావు, గోపాలకృష్ణ, వాసు, వెంకన్న, సత్యం, చిన్నప్పయ్య, అశోక్, కిషన్, పద్మావతి, సువర్ణ, ఇందిర, లక్ష్మి, ప్రసన్న, జ్యోతి, శోభారాణి, కళావతి, కరుణ, నర్మద తదితరులున్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం పరిధిలో గల రెయిన్ సిమెంట్ పరిశ్రమ ప్రియానగర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమ జనరల్ మేనేజర్ పి.గురప్ప, ఉద్యోగులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ



శివాలయంలో భూమి పూజ చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని శివాలయంలో రూ.10లక్షలతో తడకమళ్ల జానకిరామారావు–అనసూయమ్మగార్ల జ్ఞాపకార్థంగా వారి కుమారులు తడకమళ్ల వెంకటేశ్వర్‌రావు, మారుతి శేఖర్‌రావు, ఉమాధర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణ పనులకు వారు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ సీతారాంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్, శివాలయం కమిటీ చైర్మన్ నలజాల రామారావు, ప్రధాన అర్చకులు శ్రీరామకవచం సుబ్రహ్మణ్యశాస్త్రీ, కొంపెల్లి కృష్ణశాస్త్రీ, గ్రామస్తులు తదితరులున్నారు.

అన్నదానానికి విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి మందిరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మునగాల మండలం కృష్ణానగర్ గ్రామానికి చెందిన వీరంరెడ్డి నారాయణమ్మ జ్ఞాపకార్థంగా ఆమె భర్త వీరారెడ్డి, కుమారుడు వెంకటరెడ్డి ఆలయంలో నిర్వహించనున్న శాశ్వత అన్నదానం కార్యక్రమానికి రూ.11,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, కాసాని ఉపేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మతతత్వ రాజకీయాలు చేస్తున్న బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

హుజూర్‌నగర్ : దేశంలో బీజేపీ మతతత్వ రాజకీయాలు చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మతతత్వ రాజకీయాలు చేస్తున్న బీజేపీని పారద్రోలాలని అన్నారు. మత విద్వేష రాజకీయాలకు సీపీఐ వ్యతిరేకమన్నారు. చిల్లర రాజకీయం కోసం వైద్య విద్యార్థి ప్రీతి మృతిని లవ్ జిహాద్‌గా బీజేపీ నాయకులు మాట్లాడడాన్ని ఆయన తప్పుపట్టారు. డాక్టర్ ప్రీతి మృతిపై నిజ నిర్ధారణ కమిటీ వేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



నడిగూడెం : కాగితరామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



మోతె : బుర్కచర్ల పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం జెడ్పీ పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అలాగే విద్యార్థులు అధికారులు, ప్రజాప్రతినిధుల వేషధారణలో అలరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం షేక్.ఇమామ్, ఉపాధ్యాయులు సునీతకుమారి, సూర్యనారాయణరెడ్డి, ఆజ్మీరుల్లా, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతె : మండల పరిధిలో బుర్కచర్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలతో పాటు రాఘవాపురం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, గ్రామసర్పంచ్ కరుణసాగర్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ కొండ లక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం ఏ.వెంకన్న, ఉపాధ్యాయులు, సింహాద్రి, రాము, విజయలక్ష్మి, రాఘవాపురం సర్పంచ్ గుండాల గంగులు, హెచ్‌ఎం నిమ్మల శ్రీను, ఎంపీటీసీ మద్ది మధుసూదన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కుక్కల దాడిలో ఆవుదూడ మృతి

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : వీధి కుక్కల దాడిలో ఓ ఆవుదూడ మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. దొండపాడు గ్రామానికి చెందిన పోటు బచ్చయ్య ఆవుదూడపై బుధవారం తెల్లవారుజామున వీధికుక్కలు దాడి చేశాయి. దీంతో ఆవుదూడ మృతి చెందింది. దీంతో గ్రామస్తులు గామంలో రాస్తారోకో నిర్వహించి వీధి కుక్కలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్‌సీడీ కిట్లు పంపిణీ

నడిగూడెం : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో షుగర్, బీపీ రోగులకు ఎన్‌సీడీ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, ఏఎన్‌ఎం రాధ, ఆశకార్యకర్తలు శ్రీలక్ష్మి, సునీత, లక్ష్మి, సైదమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సబిత, స్వర్ణలత, కొండలమ్మ, కవిత పాల్గొన్నారు.

శ్రీహరి మృతి తీరనిలోటు

హుజూర్‌నగర్ : ప్రజల మదిలో నిలిచిన వ్యక్తి వుప్పాల శ్రీహరి అని, ఆయన మృతి తీరనిలోటని పలువురు కొనియాడారు. ఇటీవల పట్టణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రీహరి సంతాప సభ పౌరవేదిక ఆధ్వర్యంలో స్థానిక వాసవీ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయాలి

మోతె : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు వేలాదిగా పాల్గొనాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు ఒగ్గు సైదులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.